

# యా బలఖ్ యా బాషా

బలఖ్ అనే రాజ్యాన్ని ఇబ్రహీం అధుమ్ అనే రాజు పరిపాలించేవాడు. ఆయన పేరు అధుమే అయినా అందరూ ఆయన్ని 'బలఖ్ కా బాషా' అని పిలిచేవారు. ఆయన మహా విలాస పురుషుడు. షోకిల్లా మనిషి, రోజుకి ఏడు జతల బట్టలు తొడిగి ఏడు జతల బట్టలు విడిచేవాడు.

అందుకనే యిప్పటికీ 'అధుమ్ అంతటి రాజు లేడు. ఆయన చేసినంతటి షోకు లేదు' అని సామెత.

అట్లాంటి అధుమ్ రాజు ఒకరోజు రాత్రి హంసతూలికా తల్పం మీద వాలి ఆలోచనలో పడ్డాడు.

'ఏమిరా నా జీవితం. రాజ్యమూ ప్రజలూ షోకులూ షికార్లూ అని చూసుకుంటున్నానే తప్ప దైవచింతన అనేదే చేయడం లేదుకదా. యికమీదట కొద్దోగొప్పో దైవచింతన కూడా చేయాలి' అని అనుకున్నాడు.

అలా అనుకున్న వెంటనే ఆయన ఎదుట ఒక మనిషి నిలబడి కనిపించాడు. అర్ధరాత్రి వేళ, పహారా వేళలో, రాజుగారి అంతరంగిక మందిరంలో ఒక ఆగంతకుడు ప్రత్యక్షమవడం చూసి అధుమ్ రాజుకి మతిపోయింది.

'ఏయ్. ఎవరు నువ్వు. ఈ వేళలో ఏం చేస్తున్నావ్? అసలు ఎవరు నిన్నిక్కడకు రానిచ్చింది?' అని గద్దించాడు.

అప్పుడా మనిషి 'మహారాజా. మన్నించండి. నా ఒంటె ఒకటి తప్పిపోయింది. మీ మందిరం పైకప్పులో వుందేమోనని వెతుక్కుంటూ వచ్చాను' అన్నాడు.

'ఓయ్ పిచ్చివాడా. ఏం మాట్లాడుతున్నావ్? అంత పెద్ద ఒంటె నా మందిరం పైకప్పులో ఉంటుందా? వెళ్లు వెళ్లు. ఈ పిచ్చితనం మాని వెళ్లు' అన్నాడు అధుమ్ రాజు.

'మహారాజా. పైకప్పులో ఒంటె ఉండటం ఎంత అసాధ్యమో హంసతూలికా తల్పం మీద పడుకున్న మనిషిలో దైవచింతన వుండటం అంత అసాధ్యం' అని ఆ మనిషి అదృశ్యమైపోయాడు.

అధుమ్‌రాజు కళ్లు తెరుచుకున్నాయి. ఈ రాజ్యం, ఈ భోజ్యం వున్న నేను ఎన్నటికీ దైవానికి చేరువ కాలేను అనుకొని అప్పటికప్పుడు రాజ్యాన్ని వదిలేసి ఒక చాప, ఒక దిండు, ఒక చెంబు తీసుకుని అడవులకు బయలుదేరారు.

కొంతదూరం వెళ్లాక ఆయనకు ఒక మనిషి తల కింద చేయి పెట్టుకుని నిద్రపోతూ కనిపించాడు. దేవుడు యిచ్చిన చేయి ఉండగా దిండు ఎందుకు అని దిండు పారేశాడు రాజు. మరికొంతదూరం వెళ్లాక ఒక మనిషి కటిక నేలమీద పడుకుని కనిపించాడు. దేవుడు యిచ్చిన నేల



ఉండగా ఈ చాప ఎందుకు అని దాన్ని కూడా పారేశాడు. మరికొంత దూరం వెళ్లాక ఒక మనిషి దోసిళ్లతో నీళ్లు తాగుతూ కనిపించాడు. దైవం ఇచ్చిన చేతులు వుండగా ఈ చెంబు ఎందుకు అని దాన్ని కూడా పారేశాడు.

అలా వెళ్లి వెళ్లి వెళ్లి ఒక ఔలియా (గురువు) దగ్గర చేరి అనేక ఏళ్లపాటు దైవచింతనలో గడిపాడు రాజు. అయినప్పటికీ ఆయనకు గురుస్థానం రాలేదు.

ఒకసారి ఔలియా గారి భార్య ఔలియాతో 'ఏమండీ. అధుమ్ రాజు అన్నేళ్లుగా సర్వం త్యాగం చేసి దైవచింతనలో వున్నాడు గదా. మరి ఆయనకు దక్కవలసిన స్థానం ఆయనకు యివ్వరా?' అని అడిగింది.

అప్పుడు ఔలియా నవ్వి 'నువ్వు వెనుక నుంచి వెళ్లి నీ మోకాలితో ఆయన వీపు మీద ఒక తాపు తన్నిరా' అన్నారు.

కిందకూర్చుని ఏదో చదువుకుంటున్న అధుమ్‌రాజును వెనుకవైపుగా వెళ్లి మోకాలితో ఒక్కతోపు తోసింది ఔలియాగారి భార్య.

ఆ తోపుకి కిందపడిన అధుమ్‌రాజు అప్రయత్నంగా 'యా బలఖ్ యా బాషా' అన్నాడు.

అంటే 'బలఖ్ రాజ్యానికి రాజంతటివాణ్ణి. నన్ను మోకాలితో తంతావా?' అని భావం.

అప్పుడు ఔలియాగారు తన భార్యతో 'చూశావా? ఇన్నాళ్లూ ఆయన మన దగ్గర వున్నా యింకా రాజన్న సంగతి మర్చిపోలేదు. ముందు రాజు నుంచి మనిషి కావాలి. మనిషి నుంచి దైవప్రియుడు కావాలి' అన్నారు గురువు.

అధుమ్‌రాజు ఆ తర్వాత ఒకటి కాదు రెండు కాదు మొత్తం నలభై ఏళ్లపాటు ఒక కొండ మీద ఏకాంతంగా దైవధ్యానం చేస్తూ జీవించాడు. ఆయన రోజూ ఒక షావుకారు దగ్గరకు వెళ్లి తనకు కావాల్సిన సరుకులు తెచ్చుకుని వండుకుని తినేవాడు.

ఒకరోజు ఆయన షావుకారు దగ్గరకు వెళ్ళి ఖర్జూరాలు కొన్నాడు. అవి తూకం వేసి యిస్తున్నప్పుడు ఒక ఖర్జూరం కింద పడి కనిపించింది. అది తనదే ఏమో అనుకొని దానిని కూడా కలుపుకొని వచ్చేశాడు అధుమ్‌రాజు.

కొండమీదకు చేరుతుండగా 'అయ్ అధుమ్. నలభై ఏళ్లుగా దైవచింతన చేసినందుకు నీకు దక్కిన ఫలం అంతా వృధా అయ్యిందిపో' అనే వాణి వినిపించింది.

అధుమ్ రాజుకు మతిపోయింది. నేనేమి తప్పు చేశాను అని వెర్రివాడిలా ప్రశ్నిస్తుంటే 'పరుల సొమ్మును సొంతం చేసుకున్నావు' అని సమాధానం వచ్చింది.

యింక అధుమ్ రాజుకు ఏం చేయాలో పాలుబోలేదు. అయ్యో ఎంత తప్పు చేశాను ఎంత తప్పు చేశాను అని తపించిపోయాడు. వెంటనే కొన్ని ఖర్జూరాలు తీసుకెళ్లి షావుకారుకు సంగతి చెప్పి ఒకటికి రెండు వాపసు చేయబోయాడు. షావుకారు చాలా ఆశ్చర్యపోయాడు.

'అయ్యా. మీరు మహానుభావులు. నాకు తెలియకుండా నా ఖర్జూరం తినడమే నాకు మహా ప్రసాదం. అలాంటిది మీరు ఒకటికి రెండు వాపసు చేస్తారేమిటి?' అన్నాడు.

'కాదు కాదు. పరుల సొమ్ము అయాచితంగా ముట్టకూడదు. నువ్వు వాపసు తీసుకుని నన్ను క్షమిస్తేనే నేను యిక్కడి నుంచి వెళ్లేది' అన్నాడు.

అలాగే అని క్షమించాడు షావుకారు.

అప్పుడు పైనుంచి 'అయ్ అధుమ్. నలభై ఏళ్లుగా దైవచింతన చేసినందుకు నీకు దక్కాల్సిన ఫలం తిరిగి దక్కిందిపో' అనే వాణి వినిపించింది.

అలా జీవించి జీవించి ఆయన వృద్ధాప్యంలో మక్కాకు చేరాడు. అక్కడే చివరి రోజులు గడుపుతూ వుంటే ఒకసారి బలఖ్ రాజ్యపు యువరాజు అక్కడకు వచ్చాడు. బలఖ్ రాజ్యపు యువరాజంటే ఎవరు? మన అధుమ్‌రాజు కుమారుడే. రాచదుస్తులలో ఎంతో ఠీవిగా ఎంతో సౌందర్యంగా వస్తున్న తన కుమారుణ్ణి చూసుకుని ఒక్క నిమిషం ఆయనలోని తండ్రి మనసు చలించింది.

'అబ్బా. నా కుమారుడు ఎంతటి వాడయ్యాడు' అనుకున్నాడు.

వెంటనే పైనుంచి వాణి వినిపించింది - 'అయ్ అధుమ్. నీకు నేను ప్రియమా? నీ కుమారుడు ప్రియమా?' అని.

అధుమ్ కంగారుపడి 'ప్రభూ. నాకు నువ్వే ప్రియం. నీవు తప్ప నాకు ప్రియమైనది మరేదీ లేదు' అన్నాడు.

'కాదు బాగా ఆలోచించుకో. నీకు నీ కుమారుడు కావాలా? నేను కావాలా?' అని వినిపించింది వాణి.

'ముమ్మాటికీ నువ్వే కావాలి ప్రభూ' అన్నాడు అధుమ్ రాజు.

ఎప్పుడైతే ఆయన ఆ మాట అన్నాడో వెంటనే ఆయన కుమారుడు చనిపోయాడు.

భోగంలో మునిగిన ఆ రాజు అలా చివరి వరకూ అనేక త్యాగాలు చేసి, పరీక్షలకు నిలబడి దైవానికి చేరువ అయ్యాడు.